క్లుప్తంగా

నేడు అమ్మవారికి గాజుల అలంకరణ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో లాకుల వద్ద ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం గాజుల అలంకరణ చేస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి యూవీ ప్రసాదరావు తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ కార్తికమాసం రెండవ శుక్రవారం సందర్భంగా శ్రీకనకదుర్గ అమ్మవారికి గాజుల అలంకరణ చేస్తామన్నారు. భక్తులు అమ్మవారి గాజుల అలంకరణను దర్శించి పూజలు నిర్వహించాలని కోరారు. అనంతరం ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం చేస్తామని అన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

పెనమలూరు: రాష్ట్రంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తాడిగడప మున్సిపాలిటీ మేనేజర్ ఎస్.విజయలక్ష్మి అన్నారు. పోరంకి 2 సచివాలయంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించి సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పోరంకి 2వ సచివాలయంలో గత నాలుగున్నర సంవత్సరాలలో 29.75 లక్షల సాయం అర్హులకు ప్రభుత్వం అందించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వేమూరి బాలకృష్ణ, చుండూరు శేఖర్‌బాబు, వీర్ల బుజ్జి, ఆకునూరు సుబ్బారావు, నల్లమోతు జీవన్, నందేటి సుధారాణి, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో కానూరు విద్యార్థుల ప్రతిభ



పెనమలూరు: అబాకస్ పోటీల్లో కానూరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి బహుమతులు గెలిచారు. అంతర్జాతీయ గుర్తింపు ఉన్న సిప్ అబాకస్ స్థానిక బ్రాంచ్ హెడ్ మంజుల గురువారం వివరాలు తెలుపుతూ జాతీయ సిప్ అబాకస్ అర్థమెటిక్ పోటీలు హైదరాబాద్‌లో గత ఆదివారం నిర్వహించగా కానూరు బ్రాంచి నుంచి పాల్గొన్న కె.అవినాష్, కె.అభినవ్, కె.దీక్షిత్ ఉత్తమ ప్రతిభ చాటి బహుమతులు గెలిచారన్నారు. ఈ సందర్భంగా కానూరు బ్రాంచిలో సిప్ అబాకస్ ఎండీ దినేష్ విద్యార్థులను అభినందించారు.

గ్రామాల్లో వికసిత్ భారత్

గన్నవరంరూరల్: మండలంలోని చిక్కవరం, గొల్లనపల్లి గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ కార్యక్రమం జరిగింది. గొల్లనపల్లిలో సర్పంచ్ గణపవరపు శాంతి అధ్యక్షతన జరిగిన సభలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజలు ఈ పథకాలు వినియోగించుకోవాలని కోరారు. ఎస్ఆర్ఈజీఎస్, ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కల్యాణ్, అన్నా యోజన వంటి 13 పథకాలపై గ్రామస్తులకు వివరించారు. ఎంపీడీవో సత్యకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల నిధులు విడుదల

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అవసరమైన నిధులను గురువారం విడుదల చేసినట్టు ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలియచేశారు. విజయవాడ రూరల్ మండలంలో మొత్తం 17,276 మంది లబ్ధిదారులుండగా వారికి పంపిణీ చేసేందుకు 4కోట్ల 81లక్షల 16వేల750 రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందని తెలియజేశారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

కంకిపాడు: దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు సూచించారు. కంకిపాడు పట్టణంలోని ఆర్బీకే నుంచి ధాన్యం లోడు లారీని గురువారం మిల్లుకు తరలించారు. లారీకి అగ్రిబోర్డు చైర్మన్ విజయ్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేస్తుందన్నారు. మద్దతు ధర పొందేందుకు రైతులు ఆర్‌బీకేలను ఆశ్రయించాలని, దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, వీఆర్ఓ ఏడుకొండలు, వీఏఏ జ్వాలా నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం

ఉంగుటూరు: యువతరం ఓటు ద్వారా మెరుగైన ప్రగతికి నాంది పలకాలని తహసీల్దార్ డి.వనజాక్షి అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ఓటు నమోదు ప్రక్రియను వివరించారు. అనంతరం విద్యార్థులతో కలసి ఓటు హక్కు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ శ్రీలత, కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, వీఆర్వోలు నళిని కుమార్, సునీల్, కార్యదర్శి కృపాకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

డేంజర్ జోన్...జర జాగ్రత్త!

- పోరంకి వద్ద ప్రమాదకరంగా జాతీయ రహదారి
- ప్రమాదానికి కారణమవుతున్న సిమెంట్ దిమ్మెలు

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పోరంకి చేపల కుండీల వద్ద అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రదేశంలో జాతీయ రహదారిపై సిమెంట్ దిమ్మెలు ఉంచటంతో తరచుగా ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. సిమెంట్ దిమ్మెలు తొలగించటానికి అవకాశం ఉన్నా ఎన్‌హెచ్ఐ అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. దీంతో ఈ ప్రదేశం డేంజర్ జోన్‌గా పరిణమించింది.



పోరంకి చేపల కుండీల వద్ద రోడ్డు పై ఉన్న సిమెంట్ దిమ్మెలు

పెనమలూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిని ఏడు సంవత్సరాల క్రితం విస్తరించి నిర్మాణం చేశారు. అయితే పోరంకి చేపల కుండీల వద్ద (పాత పోలీస్‌స్టేషన్) గతంలో రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో దాదాపు 30 కుటుంబాల వారు పాకలు వేసుకుని చాలా కాలంగా నివాసం ఉండటంతో వారిని తొలగించలేదు. ఈ కారణంగా ఈ ప్రాంతంలో దాదాపు 100 మీటర్ల మేర జాతీయ రహదారి విస్తరణ జరగలేదు. ఇళ్ల పైకి వాహనాలు దూసుకు వస్తాయని ఆనాడు భద్రతా చర్యల్లో భాగంగా రోడ్డుపై సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు. అయితే వీటి కారణంగానే అనేక ప్రమాదాలు జరిగాయి. పలువురు ప్రాణాలు పోగొట్టుకున్నారు. రాత్రి సమయాల్లో సిమెంట్ దిమ్మెలు కనిపించక పోవటంతో నేటికీ తరచుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

పేదలు ఖాళీ చేసినా తొలగించని దిమ్మెలు

కొద్ది నెలల క్రితం ప్రభుత్వం పేదల పాకలు, కట్టడాల ధర వెల కట్టి పరిహారం కింద సొమ్ము ఇచ్చింది. పాకలు తొలగించినందుకు బాధితులకు జగనన్న కాలనీలో గృహాలు మంజూరు చేశారు. ఇక్కడ ఉన్న నివాసితులు ఈ ప్రాంతాన్ని ఖాళీ చేశారు. అయితే రోడ్డుపై ఉన్న సిమెంట్ దిమ్మెలు మాత్రం ఇప్పటివరకు తొలగించలేదు. దీని కారణంగా జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రాత్రి సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి నిర్మాణం చేయాలి

చేపల కుండీల వద్ద గతంలో నివాసాలు ఉండటంతో ఈ ప్రాంతంలో రహదారి నిర్మాణం చేయలేదు. ఇప్పుడు అన్ని అడ్డంకులు తొలగినందున జాతీయ రహదారి నిర్మాణం చేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు ఎన్‌హెచ్ఐ అధికారులను కోరుతున్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణకు డివైడర్ కట్టింగ్‌లు కూడా ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

యనమలకుదురు ఆలయంలో కుంభాభిషేకం

- అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణ
- 10 వేల మంది భక్తులకు అన్నసంతర్పణ



యనమలకుదురు ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అలంకరణ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో కొండపై ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో కార్తికమాసం సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ స్వామివారికి కుంభాభిషేకం ఘనంగా చేశారు. శ్రీపార్వతీదేవి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి, శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ రామలింగేశ్వరస్వామి చారిటబుల్ ట్రస్టు సహకారంతో పది వేల మంది భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఆధ్వర్యంలో ఆలయంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్, ఈవో బి.గంగాధరరావు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

కంకిపాడు: అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలోని జగనన్న లే అవుట్‌లో రూ.11 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల్లో లోపాలు తలెత్తకుండా జరిగేలా చూడాలన్నారు. జగనన్న లే అవుట్‌లలో వసతుల కల్పన సమర్థంగా సాగుతుందని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం సోనియా, నాయకులు నెరుసు సతీష్, బందెల సుబ్బారావు, లాం సురేష్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



ఉప్పలూరులో సంక్షేమ బ్రోచర్లను చదివి వినిపిస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కంకిపాడు: సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పాలన వివరించి, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి, సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సంతోషంగా ఉండటాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. ప్రతిపక్షాలు చేసే నీచ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ లాం సోనియా, ఎంపీటీసీ లాం పార్వతి, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, వైఎస్సార్‌ సీపీ నాయకులు మాగంటి శ్రీనివాసరావు, బందెల సుబ్బారావు, లాం సురేష్, ఎస్.వెంకటరమణ, నిమ్మకూరి జ్యోతి, లాం మంగమ్మ, మారేడుమాక సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలి



ఆత్కూరులో రాష్ట్రానికి జగన్ ఎంత అవసరమో వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. ఆత్కూరులో పల్లెకు పోదాం, ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డులను, వైఎస్సార్ సీపీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత అవసరమో వివరిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించి బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి, ఎంపీడీవో శేషగిరిరావు, ఎంపీటీసీ సభ్యులు సొంగా మేరి, శివలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్నేపల్లి సింహాచలం, గుడిసే బాలస్వామి, వినయ్, చంటి, రవికుమార్, శ్రీనివాస్, శోభనాద్రి, మేరీరాణి పాల్గొన్నారు.

అల్లాపురంలో...

గన్నవరం: మండలంలోని అల్లాపురం గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రూ.16.72 కోట్లతో గత నాలుగున్నరేళ్లుగా అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూడిన సంక్షేమ బోర్డును గ్రామ సర్పంచి డొక్కు సాంబశివ వెంకన్నబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ పద్ధతిలో రూ.9.31 కోట్లు, నాన్ డీబీటీ పద్ధతిలో రూ.7.41 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎంపీటీసీ సభ్యులు గంతోటి ప్రశాంతి ఎగురవేశారు. పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు పాలిమేర పెత్రు, ఉపాధ్యక్షుడు తిరివీధి నానిబాబు, సచివాలయ కన్వీనర్ పఠాన్ హిమాంబి తదితరులు పాల్గొన్నారు.

ఎనికేపాడులో...

రామవరప్పాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పలు రాష్ట్రాలలో ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నారని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు సచివాలయం-1లో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ వివరాలతో కూడిన సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ సచివాలయం-1 పరిధిలో సుమారు రూ.34 కోట్లు సంక్షేమ పథకాలతో పేదలకు నేరుగా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందని తెలిపారు. ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ అంజనీకుమారి ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

5నుంచి ఆటోకాడ్ కంప్యూటర్ ఉచిత కోర్సులు

ఉంగుటూరు: ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈ నెల 5వ తేదీ నుంచి ఆటోకాడ్ 2డీ, 3డీ ఉచిత కంప్యూటర్ కోర్సులు ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలలు శిక్షణ ఉంటుందని చెప్పారు. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా చేసినవారు అర్హులని, శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సదుపాయం ఉంటుందని, వివరాలకు 98496 68837 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

అక్రమ లే అవుట్‌పై సీఆర్‌డీఏ చర్యలు



అక్రమ లే అవుట్‌లో రోడ్లు ధ్వంసం చేస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం శేరీనరసన్నపాలెంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వ్యవసాయ భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా వేసిన అక్రమ లే అవుట్‌పై ఏపీ సీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఆదేశాల మేరకు గురువారం అక్రమ లే అవుట్‌లోని రోడ్లు, సర్వే రాళ్లను పొక్లెయిన్ సాయంతో అధికారులు తొలగించారు. వ్యవసాయ భూముల్లో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా రోడ్లు నిర్మించి ప్లాట్లుగా విభజించి విక్రయించటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అమాయక ప్రజలు అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయటం వల్ల నష్టపోతారని, చట్టరీత్యా తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని సీఆర్‌డీఏ అధికారులు చెప్పారు. అనధికార లే అవుట్లలో భవన నిర్మాణాలకు సీఆర్‌డీఏ అనుమతులు లభించవని స్పష్టం చేశారు.

ఎన్నికల విధులకు అధికారుల వివరాల సేకరణ

విజయవాడరూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం 2024వ సంవత్సరంలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన సిబ్బంది వివరాలను సేకరిస్తోంది. జూనియర్ అసిస్టెంటు కేడర్ నుంచి గెజిటెడ్ ఆఫీసర్ కేడర్ వరకు పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు అనగా సర్వీసు రికార్డులో వున్న వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడ విధులను నిర్వహిస్తున్నారు, సొంత గ్రామం ఎక్కడ, ఏ కేడర్ లాంటి వివరాలతో పాటు ఆ ఉద్యోగులు ఎప్పటిలోగా ఉద్యోగ విరమణ చేస్తారనే వివరాలను పూర్తిగా తీసుకుని ఎన్నికల సంఘానికి పంపుతున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంటు ప్రిసైడింగ్ అధికారి, మరో ముగ్గురు అధికారుల అవసరం వుంటుంది. గన్నవరం నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలుండగా అందుకు గాను ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధుల నిర్వహణకు ఐదుగురు చొప్పున మొత్తం 1530 మంది అవసరమవుతారు. ఆ విధంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల్లో పనిచేయడానికి అవసరమైన సిబ్బంది వివరాలను ఎన్నికల సంఘం ఇప్పటి నుంచే సేకరిస్తోంది.

నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించం

టీడీపీ కౌన్సిలర్‌పై మున్సిపల్ చైర్మన్ వల్లభనేని ఆగ్రహం



టీడీపీ కౌన్సిలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ

ఉయ్యూరు: నోరుంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అజెండాలోని అంశాలను కౌన్సిల్ ముందుంచారు. ఈ క్రమంలో టీడీపీ కౌన్సిలర్ పంద్రాజు సుధారాణి లే అవుట్‌లపై చర్చను లేవనెత్తి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయటంతో చైర్మన్ వల్లభనేని జోక్యం చేసుకుంటూ '' సమావేశంలో ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. వాస్తవాలు తెలుసుకోండి. నోరుంది కదా అని అసత్యాలు మాట్లాడితే ఇక్కడ ఎవరూ సహించరు. మీ ప్రభుత్వంలో ఏం జరిగిందో మాకు తెలుసు. జగనన్న ప్రభుత్వంలో ఇంకా మంచే చేస్తున్నాం. అన్నీ పారదర్శకమే. దేనికి ఎంత ఖర్చు పెట్టామో?, దేనికి ఏ అనుమతులు ఉన్నాయో ? అన్నీ పక్కాగా ఉన్నాయి. ఇష్టానుసారం ఆరోపణలు చేస్తే ఇకపై ఊరుకోను'' అంటూ టీడీపీ కౌన్సిలర్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చైర్మన్‌తో పాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండాలోని అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసా బేగం, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాశీవిశ్వేశ్వరునికి పచ్చ కర్పూరంతో అలంకరణ

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి పచ్చ కర్పూరంతో అలంకరణ జరిపారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణలతో రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు మామిళ్ళపల్లి సాంబశివరావు, పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

'ఆడుదాం ఆంధ్ర' నిర్వహణపై శిక్షణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో చేపట్టిన ఆటల పోటీలను ప్రతి గ్రామంలోనూ సమర్థంగా నిర్వహించాలని బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు ఆదేశించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా కార్యక్రమాల నిర్వహణపై వలంటీర్లకు గురువారం శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. తొలుత ఎంపీడీవో మాట్లాడుతూ అధిక సంఖ్యలో గ్రామీణ క్రీడాకారులు భాగస్వామ్యం అయ్యే విధంగా వ్యాయామోపాధ్యాయులు, వలంటీర్లు చొరవ చూపాలని చెప్పారు. క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడా పోటీల నియమ, నిబంధనలను బాపులపాడు, ఉంగుటూరు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌లు పామర్తి వెంకటేశ్వరరావు, హరి నారాయణ వలంటీర్లకు వివరించారు. ఆయా పోటీలు నిర్వహించేందుకు కోర్టులు సిద్ధం చేసేందుకు అనుసరించాల్సిన కొలతల వివరాలను తెలియజేశారు. ఎంఈవో శ్రీరామ్ బాలసింగ్, ఎంఈవో-2 బి.సురేష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో ఉద్యోగావకాశాలు

నున్న(విజయవాడరూరల్): క్రీడల్లో ప్రతిభ చూపే క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలను కల్పించడంతో పాటు అనేక సదుపాయాలను కల్పిస్తోందని ఎంపీడీఓ బి.భార్గవి అన్నారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన ఆడుదాం ఆంధ్రపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ భార్గవి మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తిగల వారిని గుర్తించి వారితో ముందుగా రిజిస్ట్రేషన్లు చేయించాలని గ్రామ సచివాలయాల సిబ్బందికి, వలంటీర్లకు సూచించారు. రిజిస్ట్రేషన్లకు తప్పనిసరిగా ఆధార్ నంబర్‌ను నమోదు చేయాలన్నారు. సమావేశంలో గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ, సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పెరికీడులోని ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. పరమేశ్వరుని జన్మనక్షత్రమైన కార్తిక మాసం ఆరుద్ర పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం విశేష పూజలు జరిగాయి. వేకువజాము నుంచే ముక్తేశ్వరుడిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయం వద్ద బారులు తీశారు. ముక్తేశ్వరుడిని పలురకాల పూలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. స్వామి వారికి అన్నంతో వైభవోపేతంగా అభిషేకం జరిగింది. మధ్యాహ్నం ఆలయం వద్ద దాదాపు ఐదు వేల మంది భక్తులకు మహా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్ ముక్తేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నందూరు సత్య వెంకటేశ్వర శర్మ, నక్కా బాబు, మెరుగుమాల వేణు, షేక్ సాంబశివరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సారా విక్రేతలపై బైండోవర్ కేసులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: నిబంధనలకు విరుద్ధంగా సారా విక్రయాలు సాగించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గన్నవరం ఎస్ఐ ఎంఎస్ఎన్ శాస్త్రి హెచ్చరించారు. గతంలో సారా అమ్ముతూ పట్టుబడిన బాపులపాడు మండలంలోని మడిచర్ల, కొయ్యూరు, వీరవల్లి గ్రామాలకు చెందిన ఎనిమిది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గన్నవరం ఎస్ఐ ఎంఎస్ఎన్ శాస్త్రి గురువారం మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, ఇన్‌చార్జి తహసీల్దార్ కె.వెంకటరమణ ఎదుట హాజరుపర్చారు. మళ్లీ సారా విక్రయిస్తూ పట్టుబడితే రూ.లక్ష జరిమానాతో పాటుగా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తామని మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ తీవ్రంగా హెచ్చరించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కంకిపాడు: రోడ్డు ప్రమాద ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు...కంకిపాడు పట్టణానికి చెందిన మేడ సురేష్ (39) తన చిన్న కుమార్తెను మార్కెట్ యార్డు సమీపంలోని పాఠశాలలో దించేందుకు స్కూటీపై ఈనెల 29న వెళ్తుండగా నంబిగుంట కాలువ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి స్కూటీని ఢీకొంది. దీంతో మేడ సురేష్, అతని కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్సులో క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

భక్తిప్రపత్తులతో లక్ష బిల్వార్చన

ఉయ్యూరు: పట్టణంలో ఉన్న శ్రీ జగదాంబ సమేత సోమేశ్వరస్వామి (శివాలయం) దేవస్థానంలో గురువారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భాన్ని పురస్కరించుకుని స్వామి వారికి లక్ష బిల్వాలతో అర్చన చేశారు. జగదాంబ దేవికి కుంకుమార్చన జరిపించారు. స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేయించి తరించారు. ఆలయ చైర్మన్ సీహెచ్ కుటుంబరాజు, ఈఓ కానూరి సురేష్‌బాబు, పాలకవర్గ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివనామస్మరణ చేశారు. సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.